ముంపు భయం

- చినుకు పడితే వణికిపోతున్న కేఆర్‌ఎం కాలనీవాసులు
- పూడికలతో నిండిన ప్రధాన కాలువలు
- వానొస్తే ఇళ్లలోకి చేరుతున్న మురుగు
- శుభ్రం చేయని పారిశుధ్య సిబ్బంది



శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన కేఆర్‌ఎం కాలనీ

మద్దిలపాలెం: చినుకు పడితే చాలు చిగురుటాకులా వణికిపోతున్నారు కేఆర్‌ఎం కాలనీవాసులు. నగరంలోని ప్రధాన కాలువ ఈ కాలనీ మీదుగానే ప్రవహిస్తోంది. నిత్యం ఈ కాలువ పూడికలతో దర్శనమిస్తోంది. ఇళ్లలోని చెత్త, బయట నుంచి కొట్టుకొచ్చిన వ్యర్థాలతో ఇది నిండిపోయి ఉంటోంది. దీంతో చిన్నపాటి వాన కురిసినా.. కాలనీలో మురుగు నీటి ప్రవాహం ఇళ్లలోకి వస్తుంది. వర్షా కాలం వచ్చిందంటే చాలు కేఆర్ ఎం కాలనీవాసులకు కంటి మీద కునుకు కరువవుతుంది. ఏ అర్ధరాత్రి వేళ భారీ వర్షం కురిసిందా.. ఈ కాలనీ ముంపునకు గురై ఇళ్లన్నీ మురుగు నీటితో నిండిపోతాయి.

కంపుకొడుతున్న కాలువలు

జీవీఎంసీ 16, 23 వార్డుల పరిధిలోని కేఆర్‌ఎం కాలనీలో ఏ కాలువను చూసినా పూడికలు, చెత్తాచెదారంతో నిండి అధ్వానంగా దర్శనమిస్తాయి. ఇక్కడ ముంపు ప్రాంతంగా గుర్తించిన ఈ కాలనీలోని ప్రధాన కాలువ పరిస్థితి ఘోరంగా ఉంది. చిన్నపాటి వర్షం పడినా.. ఈ కాలువ పొంగిపొర్లుతుంది. నిత్యం పూడికలతో నిండిపోతున్నా.. చెత్తాచెదారం పేరుకుపోతున్నా.. వాటిని పోయిన చెత్త కుప్పలపై వాలుతున్న ఈగలు, దోమల వల్ల వ్యాధులు, విషజ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కేఆర్‌ఎం కాలనీలో అధ్వానంగా కాలువ



కేఆర్‌ఎం కాలనీ ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్త, మురుగు



శివాలయం వద్ద పూడికలతో నిండిన కాలువ

అధికారులు స్పందించాలి

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. వార్డులో పారిశుధ్య సిబ్బంది లేమి వేధిస్తోందని, వారి సంఖ్యను పెంచి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సూచిస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. వార్డుల్లో ఎక్కడా చెత్త కుప్పలు పేరుకుపోకుండా ఏరోజుకారోజు తొలగించేలా సిబ్బందిని ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్యలేవి..?

వర్షా కాలం వస్తుందంటే చాలు.. ముందు జాగ్రత్తగా ప్రధాన కాలువలు, గెడ్డల్లో పూడికలను తొలగించే ప్రక్రియను జీవీఎంసీ అధికారులు చేపడతారు. అలాంటి చర్యలు ఈ ఏడాది ఎక్కడా కనిపించలేదు. ఇంతలోనే వర్షా కాల ప్రభావం ప్రారంభం కావడంతో [illegible] పేరుకు

సంక్షేమ శాఖ మాజీ ఉద్యోగినిపై ఆరోపణలు?

ఎంవీపీకాలనీ: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించిన లొడగల శ్రీదేవి వాలంటరీ రిటైర్మెంట్ సమయంలో పలు అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమె తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలనే దురుద్దేశంలో లేని అనారోగ్యాన్ని ప్రదర్శించినట్లు సమాచారం. 2023లో తనకు లివర్ సమస్య ఉన్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులను నమ్మించడమే కాకుండా కేజీహెచ్ నుంచి దొంగ సర్టిఫికెట్ తెచ్చి చూపించి తన కుమారుడు నవతేజ్‌కు ఉద్యోగం ఇప్పించినట్లు ఆమె కూమార్తె జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. ఇందుకోసం ఆ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులకు లంచాలు కూడా ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదు వ్యవహారంపై కలెక్టర్ ఆదేశాలతో దర్యాప్తు చేసే అవకాశముందని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎంవీపీకాలనీ: ఇసుకతోట కూడలి జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో శివాజీపాలేనికి చెందిన పాతరపల్లి వెంకటరమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. శ్రీత్యాంలోని ఓ అల్పాహార దుకాణంలో వెంకటరమణ టిఫిన్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజాము 5.30 గంటల సమయంలో విధులకు హాజరయ్యేందుకు ఇసుకతోట కూడలి హైవేపై నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని వెంకటరమణను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటరమణ భార్య కొండమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

'కర్మయోగి' పుస్తకావిష్కరణ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఐఐపీఎం వేదికగా శుక్రవారం కర్మయోగి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖపట్నం శాఖ, అల్వార్‌దాస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐఐపీఏ ఏపీ రీజనల్ బ్రాంచ్ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఎం.గోపాలకృష్ణ లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి పుస్తకాన్ని రచించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ ఈఏఎస్ శర్మ, మాజీ డీజీపీ నందూరి సాంబశివరావు, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు తార్కాణమే 'స్పెక్ట్రమ్'



విద్యార్థుల ఆవిష్కరణను తిలకిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖ విద్య: విద్యార్థుల అద్భుత ప్రతిభకు తార్కాణంగా 'స్పెక్ట్రమ్' ప్రదర్శన నిలిచిందని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం బీఎఫ్‌ఏ, ఎంఎఫ్‌ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శన స్పెక్ట్రమ్- 2025ను శుక్రవారం వీసీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలు ఆయన తిలకించి అభినందించారు. విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కళాఖండాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళా విభాగం విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ఒక ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలను నిశితంగా పరిశీలించి.. వాటి వెనుక ఉన్న భావాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో మునసబ్ వారి వీధి

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని సచివాలయ సిబ్బంది



విద్యుత్ లైట్లు లేక చీకటిలో 20వ వార్డు మునసబ్ వారి వీధి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు మునసబ్ వారి వీధిలో అంధకారం నెలకొంది. కాగితాల వారి వీధి సచివాలయం పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో రెండు రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రి వేళ చీకటిలో రోడ్డు మీదకు రావాలంటే స్థానికులు భయపడుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో విషజీవుల సంచారం వల్ల రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సచివాలయ సిబ్బందికి ఫోన్ కాల్ చేసి ఫిర్యాదు చేస్తే.. తాము ప్రధాని పర్యటన ఏర్పాట్లలో బిజీగా ఉన్నామని, ఇప్పుడేమీ చేయలేమని చెబుతున్నారని పలువురు స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణమే తమ వీధిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విజ్ఞాన కేంద్రాలపై పెత్తనం సరికాదు

మద్దిలపాలెం: విజ్ఞాన కేంద్రాలపై ప్రభుత్వ పెత్తనం సరికాదని బీజేపీ నేత, బీసీ సంక్షేమ సంఘాల నాయకుడు మూల వెంకటరావు ఒక ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచానికి విజ్ఞాన గనిగా భాసిల్లుతున్న అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో ఇతర దేశాల విద్యార్థులను నియంత్రించాలనడం ప్రపంచ మేధస్సుకు బంధనాలు వేయడమేనని పేర్కొన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న ఎందరో మేధావులు అమెరికాలోనే స్టార్టప్‌లు ప్రారంభించి, ఆ దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నారన్నారు. అలాంటి యూనివర్సిటీని ఇబ్బంది పెట్టడం కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే అవుతుందని హెచ్చరించారు. హార్వర్డ్‌తోపాటు అమెరికా యూనివర్సిటీల్లో నిత్యం జరిగే పరిశోధన ఫలాలు ప్రపంచ ప్రగతికి ఎంతగానో ఉపయోగపడతాయని, పాలకులు తమ ఆలోచనలను మార్చుకోవాలని ఆయన సూచించారు.

బాలల హక్కుల ప్రచార రథం ప్రారంభం

ఆరిలోవ: బాలలు వారి హక్కులపై అవగాహన కల్పించుకోవడానికి ప్రత్యేకంగా ప్రచార రథం అందుబాటులోకి వచ్చింది. దీన్ని శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిన్మయాదేవి పైనాపిల్ కాలనీ జిల్లా మహిళా ప్రాంగణం ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు వారి హక్కులపై ఈ రథం నగరంతో పాటు గ్రామాల్లో తిరుగుతుందని తెలిపారు. బాలలు వారికున్న హక్కులను తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. బాల్య వివాహాల వల్ల సంభవించే దుష్పరిణామాల గురించి ప్రచార రథం ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పీడీ చిన్మయాదేవి

నోటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఆరిలోవ: నోటి క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అపోలో ఆస్పత్రి ఆంకాలజీ వైద్యులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సుమన్‌దాస్, డాక్టర్ ప్రదీప్ సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నోటి క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షల బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నోటి క్యాన్సర్ పొగాకు వల్ల అధిక శాతం మందికి వస్తుందన్నారు. దేశంలో ప్రతి ఏటా 77,000 మంది నోటి క్యాన్సర్‌కు గురవుతున్నారని చెప్పారు. వారిలో 52,000 మంది మరణిస్తున్నట్లు గణాంకాలులో వెల్లడైనట్లు తెలిపారు. పొగాకు, గుట్కా వినియోగం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతోందన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా నోటి క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించగలుగుతామన్నారు. అలాంటి వారికి సకాలంలో వైద్యం అందించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని పేర్కొన్నారు. నోట్లో పుండ్లు, గాట్లు, చిగుళ్ల రక్తం కారడం తదితర సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అపోలో హాస్పిటల్‌లో స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డాక్టర్ కె.ధీరజ్‌కుమార్, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ రాజేష్‌బాబు పాల్గొన్నారు.



నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అపోలో ఆస్పత్రి వైద్యులు

యోగాపై అవగాహన

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ కళాశాల విద్యా డైరెక్టర్ ఆదేశానుసారం అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రాధాన్యం గురించి విద్యార్థులు, అధ్యాపక బృందానికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ ఏడాది థీమ్.. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ గురించి వలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆర్.కుసుమ కుమారి మాట్లాడుతూ యోగా సాధన వల్ల విద్యార్థులు మానసిక ఉల్లాసం, ఏకాగ్రతను పెంచుకోవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ కళాశాలలో యోగాపై వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని, అందరూ హాజరుకావాలని కోరారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దత్తత గ్రామాల ప్రజలకు యోగా ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అందరూ యోగాసనాలు అలవాటు చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వి.సంధ్యారాణి, డాక్టర్ కె.రవిబాబు, డాక్టర్ బి.శ్రావణ్‌కుమార్, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



కృష్ణా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యోగా ట్రైనర్

అలంకారం.. అందం @ వైజాగ్ ఎక్స్‌పో



ఎక్స్‌పోలో విక్రయిస్తున్న అలంకరణ వస్తువులు



ఆవకాయకు ఉపయోగించే పింగాణీ జాడీలు

ఏయూక్యాంపస్: మహిళలు వినియోగించే అనేక అలంకరణ, గృహ వస్తువులకు వేదికగా బీచ్ రోడ్డులోని వైజాగ్ ఎక్స్‌పో నిలుస్తోంది. పోలీస్ మెస్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోలో అతివల అలంకరణ వస్తువులు, సౌందర్య వస్తువులు, ఇంట్లో వినియోగించే విభిన్న ఉపయుక్తం వస్తువులను విరివిగా విక్రయిస్తున్నారు. ప్రత్యేకమైన రంగురంగుల దారంతో అల్లిన ఉట్టిలు, చిన్నపాటి చిలుకలు వంటి బొమ్మలు ఇంట్లో వేలాడదీయడానికి ఎంతో అనువుగా ఉన్నాయి. ఇంటి లాన్‌లో, పోర్టికోలో వీటిని వేలాడదీస్తే, సహజ సిద్ధంగా కనిపిస్తాయి. వేసవిలో పచ్చళ్లు పెట్టడానికి ఉపయోగించే పింగాణీ జాడీలు విక్రయిస్తున్నారు. సంప్రదాయ జాడీలతోపాటు రంగురంగుల్లో, విభిన్న ఆకారాల్లో ఆధునికతను అనుగుణంగా అందమైన జాడీలు ఇక్కడ అందుబాటులో ఉంచారు. డైనింగ్ టేబుల్‌పై పెట్టడానికి వీలుగా ఇవి విభిన్న సైజుల్లో లభ్యమవుతున్నాయి.

యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చూస్తూ, వేదికల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై యోగా వేదికలతో పాటు, మరో 25 అదనపు వేదికలను ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదికల వద్ద తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, హెల్ప్ కౌంటర్లు వంటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ ప్రాంతం వారు ఏ వేదికకు చేరుకోవాలి, వాహనాలు ఎక్కడ నిలపాలి వంటి వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన వేదిక మార్గంలో సుందరీకరణ, మరమ్మత్తులు, విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల మధ్యలో చెట్ల కొమ్మలు తొలగించి, డివైడర్లకు, గోడలకు రంగులు వేయాలన్నారు. మత్స్యదర్శినికి రంగులు వేసి, పాడుపడిన భవంతిని కవర్ చేయాలని సూచించారు. డ్రెయిన్లను శుభ్రపరిచి, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో విద్యుదీకరణ, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, హోర్డింగులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ముంచెత్తిన వాన



మద్దిలపాలెం జంక్షన్‌లో కురుస్తున్న జోరువాన



జలమయమైన ఎంవీపీ ఏఎస్ రాజా కూడలి



ఎంవీపీ కాలనీలో షాపుల ముందు భారీగా నిలిచిన వర్షపు నీరు

మద్దిలపాలెం: దంచికొట్టిన వానతో మద్దిలపాలెం ప్రాంతం తడిసి ముద్దయింది. శుక్రవారం సాయంత్రం గంట పాటు కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. వాటిలోని వ్యర్థాలు, మురుగు రోడ్లపైకి చేరాయి. మద్దిలపాలెం జంక్షన్‌లో వర్షంలో తడుస్తూనే ప్రజలు రాకపోకలు సాగించారు. పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డు జలమయమైంది. 16, 23 వార్డుల పరిధిలోని కేఆర్‌ఎం కాలనీ నీట మునిగింది. లోతట్టు ప్రాంతాల్లో ఒకటైన ఈ కాలనీ మోకాలి లోతు వర్షపు నీటితో నిండిపోయింది. కాలనీలోని ఇళ్లలోకి వాన నీరు చేరింది. కాలనీ మీదుగా ప్రవహించే పెద్ద గెడ్డ నీటి ప్రవాహంతో పొంగిపొర్లింది. కాలనీలో రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు కొన్ని వర్షపు నీటి ప్రభావానికి పడిపోయాయి.

రహదారులు జలమయం

ఎంవీపీకాలనీ: భారీ వర్షం కారణంగా ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లు, రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై పెద్ద ఎత్తున నీరు చేరడంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఏఎస్ రాజా కూడలి నుంచి నాలుగు వైపుల నుంచి నీరు ముంచెత్తింది. ఐ హాస్పిటల్ వైపు నుంచి ఇసుకతోట కూడలి, బీచ్ వైపు నుంచి వచ్చిన వాహన చోదకులు జలమయమైన కూడలిలో తంటాలు పడ్డారు. ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లాసన్స్ బే కాలనీ రహదారి నీట మునగడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. నుమంతవాక నుంచి లాసన్స్ బే తీరం వరకు విస్తరించి ఉన్న గెడ్డ పోటెత్తింది.

ఆక్రమణల్లో కొన్నింటిపైనే చర్యలు

- 13వ వార్డులో విచ్చలవిడిగా ఆక్రమణలు
- తూతూ మంత్రంగా అధికారుల తొలగింపులు



దీన్‌దయాల్‌పురం కూడలి వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన కంటైనర్ బడ్డీ తొలగింపు



ఎస్ఎస్ఎన్ నగర్‌లోని ఆక్రమణ స్థలంలో నిర్మించిన రెండు రేకుల షెడ్‌లు

ఆరిలోవ: జీవీఎంసీ జోన్-2 అధికారులు ఆక్రమణలు, అక్రమాలపై దృష్టి పెడుతున్నామని ప్రకటిస్తున్నారు. ఏదో ఒకటి, అర అన్నట్లు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారు. మిగిలినవి వదిలేస్తున్నారు. అదే అక్రమార్కులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతోందని, అధికారులకు కాసులు కురుపిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ 13వ వార్డులో కొందరు టీడీపీ నాయకులు విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారు. అనధికారిక ఇళ్ల నిర్మాణాలకు పాల్పడి జీవీఎంసీకి చేకూరాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు. మరోపక్క జీవీఎంసీ, రెవెన్యూ స్థలాలను ఆక్రమించి జేబులు నింపుకుంటున్నారు. అధికారులు కూడా వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వార్డులోని దీన్‌దయాల్‌పురం కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుట్‌పాత్ పక్కన స్థానిక టీడీపీ నాయకుడి అండతో ఓ వ్యక్తి ఇటీవల కంటైనర్ బడ్డీ పెట్టించి సొమ్ము చేసుకున్నాడు. దీనిపై ఫిర్యాదులు వెల్లడంతో గురువారం దాన్ని మాత్రమే అధికారులు తొలగించి, మిగిలిన వాటిని వదిలేశారు.

జీవీఎంసీ ఆదాయానికి గండికొడుతున్న టీడీపీ నాయకులు

ఎస్ఎస్ఎన్ నగర్‌లో సుమారు 100 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించి వేరే వ్యక్తులకు విక్రయించేశారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను మేనేజ్ చేస్తామని, ఎమ్మెల్యేతో చెప్పించి ఎవ్వరినీ రానీయకుండా చూస్తామంటూ హామీ ఇచ్చారు. దీంతో కొనుగోలు చేసిన వారు ఆ స్థలంలో రెండు రేకుల షెడ్‌లు నిర్మించుకున్నారు.

- శ్రీకృష్ణాపురంలో సుమారు 10 ఇళ్లకు అనధికారికంగా అదనపు అంతస్తులు వేయించి జీవీఎంసీకి చెందాల్సిన ఆదాయం వారి జేబుల్లో వేసుకున్నారు. వీటిపై స్థానికులు అధికారులకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేస్తుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు చేసేది లేక తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి ఉన్నతాధికారులకు అన్నీ తొలగించామంటూ నివేదికలు సమర్పించేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగా గురువారం దీన్‌దయాల్‌పురంలో అక్రమంగా ఏర్పాటు చేసిన కంటైనర్ బడ్డీని తొలగించారు. ఎస్ఎస్ఎన్ నగర్‌లోని ఆక్రమిత స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. శ్రీకృష్ణాపురంలోని అనధికారిక అంతస్తులపైకి వెళ్లలేదు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులే టీడీపీ నాయకులకు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు, అక్రమాలన్నింటిని తొలగించాలని కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలి



ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, తొలగించిన 4,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెంలో ర్యాలీ నిర్వహించారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయం నుంచి మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ సాగింది. అక్కడ జరిగిన సభలో సిటు జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై పోలీసులు తక్షణం నిర్బంధం ఆపాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని 1,560 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నామని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించలేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముందుగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.ఎం.కుమార్ మంగళం, మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు, పి.వెంకటరావు, జోన్ నాయకులు వి.కృష్ణారావు, వి.నరేంద్రకుమార్, కె.కుమారి, ఎం.సిహెచ్.అప్పుడు, జోన్ కార్మికులు పాల్గొన్నారు.

రేపు సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్



శిక్షణ పొందుతున్న విశాఖ క్రీడాకారులు

ఎంవీపీకాలనీ: సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జూన్ 1న ఎంవీపీకాలనీలోని అప్పుఘర్ ఎదురుగా ఉన్న పోలమాంబ ఫంక్షన్ హాలులో జరగనున్నాయి. ఈ మేరకు బ్రూస్ లీ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ చిన్నా ఓ ప్రకటనలో తెలిపారు. కొరియన్ చోటా ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల కోసం జిల్లా బాలబాలికల జట్లను శుక్రవారం ఎంపిక చేశామన్నారు. 12 ఏళ్ల బాలికల విభాగంలో టి.తేజస్విని, 13 ఏళ్ల విభాగంలో జీవీ ఆరాధ్య, 16 ఏళ్ల విభాగంలో ఎస్.కావ్య, 17 ఏళ్ల విభాగంలో పి.సౌమ్య ఎంపికయ్యారు. 12 ఏళ్ల బాలుర విభాగంలో టి.తనుష్, 13 ఏళ్ల విభాగంలో సీహెచ్ మనోజ్ యాదవ్ ఈ పోటీలకు ఎంపికైనట్లు చిన్నా వెల్లడించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గౌరీప్రియ, వైభవ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.